క్లుప్తంగా

31న మినీ జాబ్ మేళా

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌పీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ మంగళవారం కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ తిరుపతి జిల్లా అధికారి ఎస్ శ్యామ్ మోహన్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. గ్రీన్‌టెక్, కాంటినెంటల్, అమరరాజా పరిశ్రమల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంటినెంటల్ కాఫీ పరిశ్రమలో ఉద్యోగం కోసం బీటెక్, డిగ్రీలో బీఎస్సీ,, బీకాం, ఐటీఐలో ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. డిక్సన్, గ్రీన్‌టెక్, అమరరాజా పరిశ్రమలో ఉద్యోగాల కోసం పదవ తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. కనీస వేతనం 13,500 నుంచి రూ.17వేలు వరకు వేతనం లభిస్తుందని చెప్పారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7989509540, 8919889609 నంబర్లను సంప్రదించాలన్నారు.

3న పాఠశాలల్లో 'సీస్' పరీక్ష

సత్యవేడు: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్) పేరుతో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు నవంబరు మూడో తేదీన ఎంపిక చేసిన పాఠశాల్లో ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె.రవి పేర్కొన్నారు. శనివారం పరీక్షకు ఎంపిక చేసిన 35 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. ప్రత్యేక ఇన్విజిలేటర్లు పర్యవేక్షణలో 3,6,9 తరగతుల విద్యార్థులకు గణితం, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ల్లో పరీక్షను నిర్వహిస్తారు. 60 ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రం ఉంటుంది. 3,6 తరగతులకు 45 మార్కులకు, 9వ తరగతికి 60 మార్కులకు పరీక్ష ఉంటుంది. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ టూ ఉషా, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీశ్రేణులకు అండగా ఉంటాం

నారాయణవనం: వైఎస్సార్ సీపీ శ్రేణుల కుటుంబాలకు అండగా ఉంటామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని సముదాయం గ్రామ పార్టీ నాయకుడు కుప్పం నారాయణరెడ్డి(85) అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే శనివారం ఉదయం సముదాయం గ్రామానికి వెళ్లి నారాయణరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంకా పరామర్శించిన వారిలో సింగిల్‌విండో చైర్మన్ ఊరప్ప, సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి తదితరులు ఉన్నారు.

అశోకన్ కుటుంబానికి పరామర్శ

పిచ్చాటూరు: మండలంలోని నీరువాయి దళితవాడకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోకన్ శనివారం వేకువజామున గుండెపోటుతో మరణించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉదయం 9 గంటలకు నీరువాయికి చేరుకుని అశోకన్ భౌతిక కాయానికి నివాళి అర్పించారు. మృతుని కుటుంబాన్ని ఓదార్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటచలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, పార్టీ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, సర్పంచ్ సుగ్రప్రియ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పేదల ఆరోగ్యం బాగుండాలన్నదే లక్ష్యం

శ్రీకాళహస్తి: పేదవాడికి ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష తీసుకువచ్చారని వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని ఊరందూరులో శనివారం సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలోనే ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి పథకం ప్రవేశపెట్టిన దాఖలాలు లేవన్నారు. ఎంపీడీవో రఫీ ఖాన్ మాట్లాడుతూ 130మందికి బీపీ, 120 మందికి షుగర్, 57 మందికి రక్తహీనత ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. కంటి వెలుగు ద్వారా 60మందికి పరీక్షలు నిర్వహించి 33మందికి కంటి అద్దాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, గురవయ్య, విజయభాస్కర్, చెంచయ్యయాదవ్, చంద్రరెడ్డి, రంగయ్య,దిలీప్, నవీన్, మనోహర్, సాయి, గోపి, బొజ్జల కుషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి యువకుడి మృతి

కేవీబీపురం: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి యువకుడు మృతి చెందిన ఘటన కేవీబీపురం మండలం, దిగువ పుత్తూరు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం.. దిగువ పుత్తూరు గ్రామానికి చెందిన నారాయణ, జ్యోతి దంపతుల ద్వితీయ కుమారుడు లక్ష్మణ్ (21)కి బుద్ధి మాంద్యం ఉంది. ఈ క్రమంలో శనివారం తెల్లవారు జామున బహిర్భూమి నిమిత్తం పొలాల వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. లక్ష్మణ్ అన్న రాముకు సైతం మతిస్థిమితం లేదు. ఇతను మూడేళ్ల క్రితం అదృశ్యమై తిరిగిరాలేదు. ఉన్న ఇద్దరు దూరమవ్వడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో శనివారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 68 మంది గర్భిణులకు వైద్యాధికారి దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే ఏఎన్‌ఎం వద్ద పేరు నమోదు చేసుకోవాలని, రక్త హీనత రాకుండా మందులను వాడాలని తెలిపారు.

ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు


పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ఇంటివద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 3వ వార్డు భాస్కర్ పేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మహిళలు హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రజలకు మేలు జరుగుతుంది కాబట్టే ఎక్కడికి వెళ్లినా ఆత్మీయ స్వాగతం లభిస్తోందన్నారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. స్థానికులు విన్నవించిన కాలువలు, రోడ్లు, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. నాయకులు జనార్దన్‌రావు పవర్, అంజూరు శ్రీనివాసులు పులి రామచంద్ర, పులి మోహన్ రావు, పులి రాధాకృష్ణ పీఎం చంద్ర, ఈశ్వరయ్య, బండారు రవి, సురేంద్ర, చల్లా రమంజయ, పార్థసారథి, పోతులూరు, చల్ల చంద్ర శేఖర, మాజీ కౌన్సిలర్ బండి ధర్మయ్య పాల్గొన్నారు

రోడ్డు అభివృద్ధికి సీసీఎల్ పరిశ్రమ చేయూత


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు పంచాయతీ సాధన వారిపాళానికి వెళ్లే మట్టి రోడ్డును మెటల్ రోడ్డుగా నిర్మించేందుకు గ్రామ సమీపంలోని కాంటినెంటల్ కాఫీ (సీసీఎల్) పరిశ్రమ యాజమాన్యం ముందుకొచ్చింది. రోడ్డు దుస్థితిపై సీసీఎల్ పరిశ్రమ యాజమాన్యంతో ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడి కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా అభివృద్ధి చేయాలని విన్నవించారు. స్పందించిన పరిశ్రమ యాజమాన్యం రూ.15లక్షలతో మొదటి విడతగా మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. శనివారం పరిశ్రమ పీఆర్వో కిషోర్, డీజీఎం సురేష్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, సర్పంచ్ నందయ్య, ఎంపీటీసీ సభ్యుడు మణి భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

ఏర్పేడు: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కందాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 357 మంది రోగులను పరీక్షించి మందుల కిట్లు అందజేశారు. జెడ్పీటీసీ తిరుమలయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య, సర్పంచ్ శ్రీదేవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఇసుక రవాణాతో సంబంధం లేదు

పిచ్చాటూరు: మండలంలోని అడవికొడియంబేడులో ఇసుక అక్రమ రవాణాపై వస్తున్న వదంతులను నమ్మొద్దని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. తనపై వస్తున్న ఆరోపణలపై పార్టీ మండల అధ్యక్షుడు చలపతిరాజుతో కలిసి శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. తన భూమిని ట్రంకీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ అనే సంస్థ లీజుకు తీసుకుందన్నారు. తాను లీజుకు ఇచ్చిన భూమిలో ఉన్న ఇసుకకు తనకు, తన కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ట్రంకీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ సంస్థ ఏడాది పాటు లీజుకు తీసుకున్న అగ్రిమెంట్ కాపీని ఆయన చూపించారు. సమావేశంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, ఏకే బేడు సర్పంచ్ కె.కిరణ్‌కుమార్, నాయకుడు త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డులతో వైద్య సేవలు

సత్యవేడు: ఆయుష్మాన్ భారత్ కార్డులతో దేశ వ్యాప్తంగా రూ.5 లక్షల విలువైన వైద్యసేవలు పొందవచ్చని ఎంపీడీఓ కె.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఏఎంపురం, దాసుకుప్పం సచివాలయాల్లో వలంటీర్లు , సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వలంటీర్లు కేటాయించిన 50 ఇళ్లకు తప్పని సరిగా వెళ్లి ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల యాప్‌లను సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు.

వేడుకగా పౌర్ణమి పూజలు

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో శనివారం పౌర్ణమి పూజలను వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అవధూత శ్రీసారకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. తమిళనాడు నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు.

సింగిరికోనలో..

మండల కేంద్రానికి సమీపంలోని సింగిరి కోన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ప్రతి స్వాతీ నక్షత్రం రోజున మహా సుదర్శనయాగం, పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీలు గిరిబాబు, భాస్కర్‌బాబు తెలిపారు. ప్రతి రోజు భక్తులకు అన్నప్రసాదాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కైలాసనాథకోనలోని కంచి, శివశక్తి ఆశ్రమాల్లో పౌర్ణమి పూజలు వేడుకగా జరిగాయి. భక్తులు, పర్యాటకులకు అన్నదానం చేశారు.


ప్రత్యేక అలంకరణలో సారకాయలస్వామి

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని సన్నిధి వీధిలో బోయ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు హాజరై అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బుల్లెట్ జయశ్యామ్, బోయ సంఘం నాయకులు ధన, మధు, నవీన్, తేజ పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయం మూసివేత

నారాయణవనం: చంద్ర గ్రహణం కారణంగా శనివారం రాత్రి 7గంటలకు శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వస్వామి ఆలయాన్ని మూసివేశారు. అర్ధరాత్రి దాటిన అనంతరం ఒంటి గంటకు ఏర్పడనున్న చంద్రగ్రహణం కారణంగా ఆలయంలో 7 గంటలకు ఏకాంతసేవ నిర్వహించి ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. అలాగే టీటీడీ అనుబంధ ఆలయాలైన పరాశరేశ్వర, అగస్త్యేశ్వర, అవనాక్షమ్మ, శక్తివినాయస్వామి ఆలయాలను సాయంత్రం 7 గంటలకు మూసి వేసినట్లు ఆర్జితం అధికారి భరత్ తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఆలయాలను తెరచి శుద్ధి, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

ఏర్పేడు: ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రభుత్వం పంటల నష్ట పరిహారం అందించాలంటే రైతులందరు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సర్పంచ్ మోహన ప్రియ అన్నారు. శనివారం మండలంలోని ఎండీపుత్తూరు రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాప్ బుకింగ్‌పై గ్రామ సభ జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు బాధ్యతగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. రాయితీపై పచ్చిరొట్ట ఎరువులైన జీలగ, జనుము అందిస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా కింద అందే సేవలపై అవగాహన కల్పించారు. ఏఓ షణ్ముగం, అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి పాల్గొన్నారు.

విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట


వరదయ్యపాళెం: వంట పాత్రల అందజేత


నారాయణవనంలో ..

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసి పేద పిల్లల చదువుకు అండగా నిలుస్తోందని ఎంపీపీ పద్మప్రియ తెలిపారు. మండలంలోని 69 పాఠశాలలకు రూ. 6.13లక్షలతో ప్రభుత్వం పంపిణీ చేసిన వంట పాత్రలను శనివారం ప్రధానోపాధ్యాయులకు ఎంపీపీ అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, పౌష్టికాహారంతో జగనన్న గోరుముద్ద కింద మధ్యాహ్న భోజనం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతగా భోజనం తయారు చేసేందుకు ఖరీదైన వంట పాత్రలను అందజేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య, ప్రధానోపాధ్యాయులు మాధవయ్య, రుద్రయ్య, సురేఖ, శశికుమార్, రమణారెడ్డి, శ్రీధరరావు తదితరులు పాల్గొన్నారు.

వంట పాత్రల పంపిణీ

నారాయణవనం: జగనన్న గోరుముద్ద పథకం కింద మండలంలోని 46 పాఠశాలలకు వంట పాత్రలను పంపిణీ చేశారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలకు జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, అధికారులతో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దిందని తెలిపారు. ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, సింగిల్‌విండో చైర్మన్ ఊరప్ప, సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, శివకుమార్, మిడ్ డే మీల్ వర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో సర్పంచులకు ప్రాధాన్యమివ్వాలి

- ఆరోగ్య సురక్షలో 5,988 మందికి వైద్య సేవలు
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పద్మప్రియ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మప్రియ

వరదయ్యపాళెం: ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీల్లో ప్రథమ పౌరులైన సర్పంచులను భాగస్వాములను చేసి ప్రాధాన్యం కల్పించాలని ఎంపీపీ పద్మప్రియ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మండల ప్రగతిని ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు నివేదించారు. అధికారులు మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను శాఖలవారీగా తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ.. మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన పనులకు సంబంధించి తయారు చేసే నివేదికల గురించి నిర్వహించే సమావేశాలకు సర్పంచులను ఆహ్వానించకుండా ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇటీవల అంబూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్పు చేసే సమయంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుల సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించి తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ సాయిరెడ్డి ఐసీడీఎస్ అధికారులను ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఎంపీపీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్‌ను గౌరవించి వారి సారథ్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రబీ సీజన్ వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో సబ్సిడీపై స్ప్రేయర్లు, ఇతర పరికరాలు పంపిణీ చేయాలని కోరగా మండల వ్యవసాయశాఖ విస్తరణాధికారి ప్రవీణ్ ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని, అందుకు స్థానికంగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా పూర్తి చేయాలని కోరారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద మండలంలో 5,988 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యాధికారులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న 4నెలలు కీలకమైన సమయమని, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కోరారు. తహసీల్దార్ గౌరిశంకరరావు మాట్లాడుతూ.. మండలంలో విడతల వారీగా జరుగుతున్న రీసర్వే పథకానికి స్థానికంగా రైతులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నెలవారీ నిత్యవసర సరుకులు పంపిణీ చేసే ఎండీఎం ఆపరేటర్లు నిర్లక్ష్యం వహిస్తే కేసులు బనాయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీలు పద్మావతి, శ్యామలమ్మ, హౌసింగ్ డీఈ శ్రీనివాసులు, ఏపీఓ భాస్కర్ పాల్గొన్నారు.



భూలోక కైలాస వాసా..

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రాత్రి పౌర్ణమి ఉంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో శ్రీస్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి అచ్యుత రాయ మండపంపై వేదిపై కొలువుదీర్చి వేదోక్తంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు కనులారా తిలకించి పులకించారు.

శివయ్య సిగలో చందమామ



శ్రీకాళహస్తీశ్వర ఆలయ శిఖరంపై శనివారం రాత్రి శివపార్వతుల శిగలో నిలిచినట్లు పౌర్ణమి చంద్రుడు దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యం భక్తులను కనువిందు చేసింది. – శ్రీకాళహస్తి

ఆలయాల జీర్ణోద్ధరణ పనుల పరిశీలన


ఆలయంలో పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంలో ఈటీసీ కేంద్రం వద్ద ఉన్న ఈశ్వరాలయం, ఊరందూరులోని శ్రీఅన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయాల జీర్ణోద్ధరణ పనులను శనివారం ట్రస్టు బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ కైలాస క్షేత్రంలో వెలసిన పురాణ ప్రసిద్ధమైన పురాతన ఆలయాలకు మహర్దశ కలిగించే విధంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వేణుగోపాల్, బాలాజీ, ఆలయ పూజారి జనార్దన్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.